ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 20 ఆగస్టు 2024





రైతు భరోసా వచ్చేదెప్పుడు?

- వానాకాలం సీజన్‌లో అందని సాయం
- పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్న రైతులు
- రెండో విడత ఎరువులకైనా డబ్బులు అందేనా?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

చెప్పిన మేరకు పంట రుణాలను మాఫీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం ఎప్పుడు అందిస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. వానకాలం సాగు మొదలై రెండు నెలలు కావస్తున్నా రైతు భరోసా పథకం అమలు ఊసే లేదు. రైతులు పెట్టుబడుల కోసం బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటుండగా అందుకు వీలు లేని వారు ప్రైవేటు అప్పులపై ఆదారపడతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 వానాకాలం సీజన్ నుంచి రైతు బంధు పథకాన్ని అమలు చేయడం ప్రారంభించింది. ఎకరాకు ఐదు వేల రూపాయల చొప్పున రెండు సీజన్లలో 10వేల రూపాయలు పెట్టుబడి సాయంగా అందిస్తూ వచ్చింది. గడిచిన ఆరు సంవత్సరాలలో వానాకాలం, యాసంగి సీజన్లలో 12 సార్లు రైతులకు క్రమం తప్పకుండా పెట్టుబడి సాయాన్ని అందించింది. 2023-24 యాసంగిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు బంధు పథకం కింద ఎకరాకు ఐదు వేల రూపాయల చొప్పున 1,90,826 మంది రైతులకు 177.61 కోట్ల రూపాయలు పెట్టుబడి సాయంగా అందించారు.



● రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎకరాకు ఒక్కో సీజన్‌కు 7,500 రూపాయల చొప్పున 15 వేల రూపాయలు పెట్టుబడి కోసం అందిస్తామని హామీ ఇచ్చింది. బీఆర్‌ఎస్ హయాంలో రైతు బంధు పథకం దుర్వినియోగం జరిగిందని సాగులో లేని భూమికి, వెంచర్లుగా మారిన భూములకు, వందలాది ఎకరాలు ఉన్న బడా బాబులకు రైతు బంధు సహాయాన్ని అందించారని విమర్శలు వచ్చాయి. ధనవంతులు ఎగువ, మధ్య తరగతి వారికి భూస్వాములకు మాత్రమే రైతు బంధు సహాయంలో పెద్ద మొత్తం ముట్టిందని, చిన్న రైతులకు ఈ పథకం కింద దక్కింది తక్కువేననే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రైతు భరోసా సహాయాన్ని ఎన్ని ఎకరాల భూమి ఉన్న వారికి ఇవ్వాలి అన్న విషయంలో అన్ని గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అయితే ఈ విషయంలో ప్రభుత్వం ఇంకా ఒక నిర్ణయం తీసుకోకపోవడంతో రైతు భరోసా సహాయం వానాకాలం సాగు ప్రారంభం అయినా అందలేదు.

● జిల్లాలో మూడు లక్షలకుపైగా ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ వానాకాలంలో 2,74,500 ఎకరాల్లో వరి, 48వేల ఎకరాల్లో పత్తి, 4,500 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేస్తారని, వీటితో పాటుగా వివిధ ఇతర పంటలను కలుపుకుని 3,45,070 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. ఇప్పటికే మూడు లక్షల పై చిలుకు ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా ఎకరాకు 7,500 రూపాయలు పెట్టుబడి సాయంగా ఇస్తే జిల్లాకు చెందిన రైతులకు 258.8 కోట్ల రూపాయలు లబ్ధి చేకూరుతుంది. గతంలో మాదిరిగా ఐదు వేల రూపాయల చొప్పున ఇచ్చినా 172.53 కోట్ల రూపాయలు రైతులకు దక్కుతాయి. ఎన్ని ఎకరాల భూమి ఉన్న రైతులకు రైతు భరోసా పథకం ఇవ్వాలి అన్న విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోని కారణంగా పెట్టుబడి సాయం ఇంకా రైతులకు అందడం లేదు. రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టి 28 రోజుల్లోనే అమలు చేసిన ప్రభుత్వం ప్రస్తుతం రైతు భరోసాపై దృష్టి సారిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. నెలాఖరులోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రెండో విడత ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుక్కోవడానికి అయినా ప్రభుత్వ సాయం ఉపయోగపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.





కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు రాఖీ కడుతున్న సోదరి శైలజ

ఘనంగా రాఖీ పౌర్ణమి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19: కరీంనగర్‌లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించుకున్నారు. సోదరీమణులు వారి సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. సోదర ప్రేమను ఆకాంక్షిస్తూ వేడుకలు జరుపుకున్నారు. ఆడపడచులు పసుపు కుంకుమలతో, మంగళహారతులతో అందమైన విభిన్న రీతుల రాఖీలతో నగరమంతా సందడి చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి

వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లి రక్షను కట్టి ఆడపడుచులు సౌభాతృత్వపు ప్రేమను పంచారు. ఈ సందర్భంగా రాఖీలు, స్వీట్ షాపులు జనంతో కిటకిటలాడాయి. స్వచ్ఛంద సంస్థలు, కార్యాలయాలు, ఆలయాల్లో రక్షాబంధన కార్యక్రమాలు నిర్వహించారు. మరో వైపు యజ్ఞోపవీతాలు మార్చుకుని ఉపాకర్మ పూజలు జరిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఆయన చెల్లెళ్లు రాఖీ కట్టారు. ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఆయన సోదరులకు సోదరి శైలజతోపాటు పలువురు మహిళలు రాఖీలు కట్టారు. బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ బండి సంజయ్‌కు రాఖీ కట్టారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఆయన సోదరులకు సోదరీమణులు పుల్ల రాణి, మల్లెపూల విమల రాఖీలు కట్టారు. భగత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ సునీల్‌రావుకు ఆయన సోదరి సుధీరతో పాటు మహిళా కార్పొరేటర్లు సుదగోని మాధవీ కృష్ణకుమార్‌గౌడ్, గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, మహిళలు రాఖీలు కట్టారు. నగరంలోని వాడవాడలా రక్షాబంధన్ వేడుకలు జోరుగా సాగాయి. ఏ ఇంట చూసినా ఆడపడుచుల సందడి కనిపించింది. ఆయా డివిజన్లకు చెందిన పలు పార్టీల కార్పొరేటర్లు, నాయకులకు మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

● కరీంనగర్ అర్బన్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణకు రాఖీ కట్టారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరా బాద్‌లో, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్యప్రసన్నరెడ్డి రాఖీ కట్టారు.



ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు



సహస్ర దీపాలంకరణ చేస్తున్న మహిళలు

దుర్గా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని దుర్గ భవానీ దేవాలయంలో దుర్గా భవానీ అమ్మవారికి ఆలయ ధర్మాదికారి పురాణం మారుతి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీహోమం, పల్లకీ సేవ, సహస్ర దీపారాధన చేశారు. ఉయ్యాల సేవలతో పాటు విశేష హారతి, పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● పరమ శివుడికి ప్రత్యేక అలంకారం

కరీంనగర్ కల్చరల్: శ్రావణ శుద్ధ పౌర్ణిమ రాఖీ పౌర్ణిమ సంద ర్భంగా నగరంలోని కమాన్‌రోడ్ రామేశ్వరాలయంలో సోమవారం రామేశ్వరుడికి తిలాబాండేశ్వరుని అలంకారం చేశారు. నువ్వులతో పాటు రాఖీలను శివునికి అలంక రించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న శివయ్యను భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో వెంకన్న, అర్చకుడు పురుమడ్ల శ్రీనివాసశర్మ, భక్తులు పాల్గొన్నారు.



తిలాబాండేశ్వరుడిగా రాఖీలతో దర్శనమిస్తున్న రామేశ్వరుడు

అవినీతి కేసులన్నీ అటకెక్కించేశారు

- రుణమాఫీపై శ్వేత పత్రం విడుదలచేయాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఆగస్టు 19: కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాడని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆయనపై ఉన్న అవినీతి కేసులన్నింటిని అటకెక్కించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంచి ముహూర్తం చూసుకుని బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌లో విలీనమవడమే తరువాయి అన్నారు. మాట ముచ్చటతో సహా కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు కప్పం కూడా చెల్లించారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబాన్ని జైలులో వేస్తామన్న వారు ఇప్పుడు సైలెంట్ అయ్యారన్నారు. విలీనంపై కాంగ్రెస్‌తో కేసీఆర్ మాట ముచ్చట పూర్తయినట్లు తమకు సమాచారముందని తెలిపారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి, వాస్త వానికి పొంతనేలేదన్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజు నాడు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొందరికే చేశారన్నారు. 40 వేల కోట్ల రుపాయలు మాఫీ చేస్తామని చెప్పి రూ. 17 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేసి సోనియా గాంధీనే మోసం చేశారన్నారు. రైతు భరోసా, విద్యార్థి భరోసా, విద్యాభరోసా, మహాలక్ష్మి వంటి ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఇవన్నీ అడుగుతుంటే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన మంటు డ్రామాలాడుతున్నారన్నారు. అవినీతి కుటుంబ పాలన విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు జోడీ పార్టీలే న్నారు. అందుకే ఆ రెండుపార్టీలు ఒక్కటవుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్‌ను విలీనం చేసుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదన్నారు. ఆ అవసరం కాంగ్రెస్‌కే ఉందన్నారు. కాంగ్రెస్‌లో అందరూ సీఎం కావాలనుకునే వాళ్లే ఎవరు ఎప్పుడు హ్యాండిస్తారో తెలియడం లేదన్నారు. అధికారాన్ని పదిలం చేసుకునేందుకు ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ, విలీనం చేసుకునేందుకు సిద్ధమయ్యారన్నారు. అవినీతి, కుటుంబ పాలనకు బీజేపీ దూరమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజల గురించి పట్టించుకోవడం మానేసి, పాలనను గాలి కొదిలేసిందని విమర్శించారు. కరీంనగర్ జిల్లాలో సాగునీరు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నార న్నారు. సాగు, తాగునీటికి ఇబ్బందిలేకుండా వెంటనే సమీక్ష నిర్వహించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

విజృంభిస్తున్న విష జ్వరాలు

● కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

సుభాష్‌నగర్, ఆగస్టు 19: వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఓవైపు వర్షాలు, మరోవైపు ఎండలతో ప్రజలు సతమతమవుతున్నారు. కలుషిత నీరు, ఆహారం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు. జ్వర పీడితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతుంది. జిల్లా ఆసుపత్రితోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రతి రోజు పెద్ద ఎత్తున జ్వరంతో బాధపడుతున్నవారు వస్తున్నారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు ప్రజలను భయపెడుతు న్నాయి. ఇంట్లో ఒకరితో మొదలైన జ్వరం మిగితాకు టుం బ సభ్యులకు విస్తరిస్తోంది. గ్రామాల్లో, పట్ట ణాల్లో మురుగు నీ ం పేరుకుపోతోంది. బ్లీచింగ్, ఫా గింగ్ చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. సర్పంచుల పాలన ముగిసిపోవడంతో, స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్య తలు తీసుకున్నవారు ఇత ర రెగ్యులర్ డ్యూటీల్లో బిజీగా ఉండ డం లాంటి కారణాలతో దోమల వ్యాప్తిని పట్టించు కోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యం కోసం ఉమ్మడి జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ నుంచి జిల్లా ఆసుపత్రికి వస్తుంటారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ఆసుపత్రికి రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ప్రతి రోజు 500నుంచి 1,300 వరకు ఔట్ పేషంట్లు వస్తున్నారు. వరకు పేషంట్లు ఉన్నారు. ఎక్కువగా డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు నమోదు అవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ అదే సంఖ్యలో చికిత్స పొందుతున్నారు. పిల్లలు కూడా జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరంతోపాటు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరుతున్నారు. దీంతో పిల్లల వార్డు పేషంట్లతో నిండిపోయింది.

● జిల్లాలో 90 డెంగ్యూ కేసులు

దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఆగస్టు 15 వరకు సుమారు 90 డెంగ్యూ కేసులు నమోద య్యాయి. ఎక్కువ మంది వైరల్ ఫీవర్‌తో బాధ పడుతూ చికిత్స పొందుతున్నవారు ఉన్నారు.



బెడ్లన్నీ నిండిపోయిన పిల్లల వార్డు

● ఎలిసా పరీక్షతోనే డెంగ్యూ నిర్ధారణ

డెంగ్యూ జ్వరాన్ని ఎలిసా పరీక్ష ద్వారానే నిర్ధారి స్తారు. ఈ పరీక్ష కేంద్రంలో జిల్లా ఆసుపత్రిలో మాత్రమే ఉంది. ప్రైవేటు ఆసుపత్రిల్లో డెంగ్యూ పరీక్ష చేయడానికి అనుమతి లేదు. డెంగ్యూ జ్వరం వచ్చిన వారిలో ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుంది. ఇది సీబీపీ పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.



చికిత్స పొందుతున్న పేషంట్లు

● దోమలతో జాగ్రత్త....

ఇంటితోపాటు పరిసర ప్రాంతాల్లో నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు పరిశ్రుభ్రంగా ఉంచుకోవాలి. పనికిరాని పాత సామన్లు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, తొట్లలో నీరు నిలువ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి తొట్లపై మూతలు పెట్టాలి. వారంలో ఒక్కసారైనా డ్రై డేగా పాటిం చాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడడంతోపాటు ఇతర జాగ్రత్తలు తీసుకోవాలి. కిటికీలకు జాలీలు అమర్చుకోవాలి



జిల్లాలో మోస్తరు వర్షం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 19: జిల్లాలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 8.30 నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు అత్యధికంగా చిగురుమామిడి మండలం ఇందుర్తిలో 26 మిల్లీమీటర్ల వర్షం పడింది. గన్నేరువరం మండలం కాసీంపేటలో 12.8, గంగాధర మండల కేంద్రంలో 11.5, రామడుగు మండలం గుండిలో 9, గంగాధర మండలం బూరుగుపల్లిలో 8.3, చొప్పదండి మండలం ఆర్నకొండలో 4.3, తిమ్మాపూర్ మండలం రేణికుంటలో 2.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.













నలుగురు డీజే నిర్వాహకులపై కేసు

తంగళ్లపల్లి, ఆగస్టు 19: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో అనుమతి లేకుండా డీజేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లెల్లలో మూడు డీజేలు, మండల కేంద్రంలోని బాబాజీ కాలనీలో ఒక డిజే సీజ్ చేసి నలుగురు నిర్వాహకులు పోలాడి నవీన్, కోడం పృథ్వి, పంది సాయికుమార్, కోడం ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ దాడులలో ఏఎస్ఐ చంద్రమౌళి, కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి





ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

శివాలయాల్లో భక్తుల పూజలు



హైకోర్టు జడ్జికి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ కిరణ్

ధర్మపురి, ఆగస్టు 19: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ నెల కొంది. శ్రావణ మాసంలో మూడవ సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారలను దర్శించుకున్నారు. వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి వారిని నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు సేవ నిర్వహించారు. పాలెపు ప్రవీణ్‌శర్మ, బూన ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి పూజలు

ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె. శరత్ దంపతులు సోమవారం సాయంత్రం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్‌జడ్జి దంపతులకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ ఉన్నారు.

కోటిలింగాలలో భక్తుల సందడి

వెల్గటూర్, ఆగస్టు 19: శ్రావణ మాసం సందర్భంగా మండలం లోని కోటిలింగాల కోటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొన్నది. శ్రావణ మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నాగ రాజు శర్మ, సంజీవ్‌శర్మలు స్వామి వారికి అర్చన, అభిషేకాలు, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వ హించారు. వెల్గటూర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

సోమేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

మల్లాపూర్, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని అతిపురాతనమైన పేరుగాంచిన సోమేశ్వర కొండపైన ఆలయంలోని స్వామి దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ పౌర్ణమి సోమవారం సందర్భంగా ఆలయంలోని శివలింగాన్ని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో సందండి నెలకొంది. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి రుద్రాభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారికి బెల్లంతో తయారు చేసిన వరద పాయసాన్ని సమర్పిం చినంతరం స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించారు. నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

ముత్తారం, ఆగస్టు 19: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ మండల కేంద్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... ముత్తారం మండల కేంద్రంలో గంట భీమయ్య అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంట భీమయ్యపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు.

ఊరచెరువులో గుర్తు తెలియని మృతదేహం



కథలాపూర్, ఆగస్టు 19 : మండలంలోని ఊర చెరువులో సోమవారం గుర్తు తెలియని మృత దేహం లభ్యమైందని ఎస్సై నవీన్ తెలిపారు. చెరు వులో శవం తేలి కనిపించగా స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 50 ఏళ్ల లోపు వయస్సున్న వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు తమకు అందజేయాలని ఎస్సై కోరారు.

పెద్దపల్లిలోని హనుమాన్‌నగర్‌లో..



పెద్దపల్లిటౌన్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో సోమవారం ఓ వ్యక్తి గుర్తు తెలియని మృత దేహం లభించినట్లు పోలీసులు తెలిపారు, అతిగా మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు గురై చని పోయినట్టు, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో ఉంచినట్లు తెలిపారు. మృతుడు చామనచాయ రంగులో ఉండి 5.6 ఫీట్ల పొడువు కలిగి జీన్ ప్యాంటు ధరించి ఉన్నట్టు, కుడి చెయ్యిపై మరాఠీ భాషలో పచ్చబొట్లు రాసి ఉన్నట్లు వివరించారు. గుర్తించిన వారు పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లోగాని, 8712 656506, 8712656507లో సంప్రదించాలని సూచించారు.



‘ఎల్లంపల్లి’ నుంచి తగ్గిన నీటి విడుదల

పెద్దపల్లి/బోయినపల్లి/ ఇల్లంతకుంట, ఆగస్టు 19: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.627 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. సోమవారం ఉదయం 6,731 క్యూసెక్కుల వరద నీరు రాగా, మధ్యాహ్నం వరకు తగ్గుముఖం పట్టడంతో రెండు మోటార్లలో ఒకదానిని నిలిపివేసి ఒక మోటార్‌తోనే నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకిం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 3,150 మానేరు, మూలవాగు ద్వారా 840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 16.11 టీఎంసీలకు చేరింది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.12 టీఎంసీల నీరు చేరింది. మధ్యమానేరు ద్వారా సర్జిపూల్‌కు వచ్చిన 3,200 కూసెక్కుల నీటిని ఒక పంప్ ద్వారా రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 11,470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 49.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 4,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

జాడలేని రోడ్డు భద్రతా చర్యలు





● జూలై 12న తెల్లవారుజామున 4 గంటలకు కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ కృష్ణనగర్ కాలనీకి చెందిన పాలాడి సాయికుమార్(26) దుర్మరణం చెందాడు. అతని స్నేహితుడు కత్తెర్ల అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సాయికుమార్, అరవింద్ బైక్‌పై అల్గునూర్ నుంచి కరీంనగర్‌కు వస్తుండగా కోతిరాంపూర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వ్యాన్‌ను వెనుకవైపు ఢీకొన్నారు. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అరవింద్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ పార్కింగ్ లైట్లు వేసుకోకుండా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రోడ్డు పక్కన పార్క్ చేయడంతో చీకట్లో వ్యాన్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిందని మృతుడి తండ్రి మహేందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

● జూలై 25న అర్ధరాత్రి కరీంనగర్‌కు చెందిన వ్యాపారి తాటికొండ రమేష్(49) చొప్పదండి నుంచి కరీంనగర్‌కు తన కారులో వస్తుండగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద రోడ్డుపై పార్క్ చేసిన లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

- పార్క్‌చేసిన వాహనాలను ఢీకొని రెండువారాల్లో ఇద్దరి దుర్మరణం
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్....
- పార్కింగ్‌లైట్స్ వేయకుండా డ్రైవర్ల నిర్లక్ష్యం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19: రోడ్లపైనే యథేచ్ఛగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాత్రి వేళ వెనుకవైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొని తరచుగా ప్రమాదలు జరుగుతున్నాయి. కరీంనగర్, శివార్ల లో ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ రెండు ప్రమాదాలు రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలను రాత్రివేళ వెనుకవైపు నుంచి వాహనదారులు ఢీకొట్టడంతో జరిగాయి. మూడేళ్ల క్రితం అల్గునూర్ పెట్రోల్‌బంక్ వద్ద రోడ్డు పక్కన నిలిపిన లారీని కారు వేగంగా ఢీకొట్టడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇటువంటి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు నిర్దిష్టమైన రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవటంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

● **నిబంధనలను పట్టించుకోకపోవడంతో..**


రాత్రి సమయాల్లో రోడ్లపై, రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలకు పార్కింగ్ లైట్లు వేసి ఉంచాలి. ఈ నిబంధనను డ్రైవర్లు పట్టించుకోక పోవడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులపై దూర ప్రాంతాలకు ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అటువంటి సౌకర్యాలు ఏవీ లేకపోవ డంతో రోడ్డు పక్కన భారీ వాహనాలు నిలిపిన డ్రైవర్లు అందులోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. రాత్రి సమయంలో వెనుకవైపు నుంచి వచ్చిన వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాలు జరుగతున్నాయి. రహదారులకు సర్వీసు రోడ్లు లేక పోవటం, మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకుండా ఓవర్‌టేక్ చేయడం వల్లనే ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

చిల్లర మరిచిపోయారా..
టెన్షన్ పడకండి

టికెట్ వెనుక సెల్ నంబర్‌రాసి ఇస్తున్న కండక్టర్



భగత్‌నగర్, ఆగస్టు 19: టికెట్‌కు సరిపడా చిల్లర తీసుకుని రావాలి... దిగేటప్పుడు చిల్లర తీసుకోండి అంటూ సర్ది చెప్పే కండక్టర్లు ఉన్న ఈ రోజుల్లో టికెట్‌కు సరిపడా చిల్లర లేక పోతే టికెట్ వెనుక డ్యూతో పాటు సంతకం చేసి తన సెల్ నంబర్ రాసి ఇస్తున్నాడో కండక్టర్. కరీంనగర్-2 డిపోలో పనిచేసే వీఎల్ నారాయణ అనే కండక్టర్ బస్సుల్లో రద్దీకి అనుగుణంగా టికెట్లు ఇచ్చి టికెట్‌కు సరిపడా చిల్లర లేక పోతే టికెట్ వెనక ఆ మొత్తంతోపాటు తన సెల్ నంబర్ రాసి సంతకం చేసి ఇస్తున్నాడు. ఎవరైనా ప్రయాణికులు ఆదరా బాదరాగా బస్సు దిగి వెళ్లి పోతే వారు టికెట్ వెనుకాల ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి టికెట్‌ను వాట్సాప్‌లో పంపిస్తే ఆయన డబ్బులను ఫోన్ పే ద్వారా పంపిస్తున్నాడు. వీఎల్ నారాయణను ప్రయాణికులతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ప్రశంసిస్తున్నారు.



టికెట్ వెనుక డ్యూతోపాటు, సంతకం, సెల్ నంబర్‌రాసి ఇచ్చిన కండక్టర్



నీటితో నిండిన రైతు వేదిక ప్రాంగణం

కుంట కాదు.. రైతువేదిక ప్రాంగణం

- నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు
- ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరుతున్న రైతులు

కొడిమ్యాల, ఆగస్టు 19 : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మించిన రైతువేదిక ప్రాంగణం రెండు రోజులుగా కురిసిన వర్షపు నీరు, సమీప పొలాల నుంచి వస్తున్న నీటితో కుంటను తలపిస్తోంది. రైతు వేదిక భవనాన్ని క్లస్టర్ పరిధిలోని రైతులకు సమావేశాలను నిర్వహించుకోవటానికి, రైతులకు శిక్షణ ఇవ్వటానికి, ఒకేసారి సుమారు 250 మంది సమావేశం కావటానికి అనుగుణంగా గత ప్రభుత్వం సుమారు 22 లక్షల రూపాయలతో నిర్మించింది. ఈ భవనాన్ని 2021లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ప్రారంభించారు. పూడూర్ క్లస్టర్ భవనం ముందు ఎక్కువగా మొరం పోస్తే నీరు నిలిచి ఉండేది కాదని పలువురు రైతులు తెలిపారు. నిర్మాణ సమయంలో రెండు మరుగుదొడ్లను నిర్మించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న రైతు నేస్తం వీసీ కార్యక్రమం పూడూర్ క్లస్టర్‌లోనే నిర్వహిస్తున్నారు.

రైతు నేస్తం కార్యక్రమానికి వచ్చే రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బందికి సహాయ పడే అటెండర్‌ను కూడా నియ మించక పోవటంతో భవనం లోపల అపరిశుభ్రంగా ఉంటోంది. నిర్వహణ ఖర్చులు పెరిగి పోవడం చేసిన ఖర్చులకు నిధులు రాకపోవడంతో ఎవ్వరు ముందుకు రావటం లేదని రైతులు తెలిపారు. సమావేశాలకు వచ్చే రైతులకు సౌకర్యంగా ఉండటానికి అదనంగా మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది. భవనం చుట్టు ప్రహరీ లేని కారణంగా కోతుల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు తెలిపారు. వర్షం కురిసిన ప్రతిసారి భవన ప్రాంగణం బురదమయంగా మారుతుందని రైతులు తెలిపారు. బురద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను, సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి
బండ లింగారెడ్డి మాజీ ఉప సర్పంచు పూడూర్



పూడూర్ రైతు వేదిక భవనం ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. భవనం ఎదుట అవసరం ఉన్నం మొరం పోయించి బురద కాకుండా చర్యలు తీసుకోవాలి. అదనంగా మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టాలి.

నిర్వహణ ఖర్చులు అందించాలి
: ఏవో జ్యోతి



రైతు వేదిక భవన నిర్వహణ ఖర్చులు అందించాలి. కోతుల బెడద ఎక్కువగా ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైతు వేదిక భవనానికి అటెండర్‌ను నియమించాలి.



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

గంజాయి విక్రేత అరెస్టు

368 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం

కోరుట్ల, ఆగస్టు 19 : ఉన్నత చదువులు చదివి కన్న వారి కలలను నిజం చేయాల్సిన ఓ బీటెక్ యువకుడు జల్సాలకు అలవాటు పడి చివరికి కటకటాలపాలయ్యాడు. చదువు కోసం ఇంటి నుంచి అమ్మ పంపే డబ్బులను జల్సాలకు వాడి అడ్డదారికి అలవాటు పడి పోలీసులకు చిక్కాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద 368 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల రెండో ఎస్ఐ శ్వేతతో కలిసి సీఐ సురేష్ బాబు వివరాలను వెల్లడించారు. రాయికల్ మండల కేంద్రానికి చెందిన పెనుకొండ గణేష్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. చదువు కోసం తల్లి ఇచ్చే డబ్బులను జల్సాలకు వాడటంతో అవి సరిపోలేదు. దీంతో ఇంకా సంపాదించాలన్న దురాలోచనతో తక్కువ ధరకు గంజాయిని కొని కోరుట్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాలలోని గంజాయి అలవాటున్న యువకులకు విక్రయించేవాడు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర రావుల పర్య వేక్షణలో ఎస్ఐ శ్వేత తన సిబ్బందితో పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పైడి మడుగు గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో గణేష్ వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలోని బ్యాగ్‌లో 368 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీ సులు అతడిని కోరుట్ల పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. రా యికల్ మండల కేంద్రానికి చెందిన యువకుడిగా గుర్తించారు. విచారణలో గ ణేష్ పూర్తి వివరాలు వెల్లడించాడు. గణేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. కేసులో చాక్యచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ శ్వేత, కానిస్టేబుల్స్ పవన్ కుమార్, శ్రీనివాస్, సాగర్‌లను సీఐ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ సురేష్ బాబు

బెల్లంపల్లి చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- వ్యాపారి కారు డ్రైవరే సూత్రధారి
- నలుగురి అరెస్టు
- రూ.24లక్షలు స్వాధీనం



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 19: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి కారు నుంచి రూ.28లక్షలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. వ్యాపారి వద్ద గతంలో డ్రైవర్‌గా పని చేసిన పటాలవత్ దాస్ అనే వ్యక్తే ఈ చోరీకి పథకం వేసినట్టు పోలీసులు గుర్తించారు. అతని తో పాటు జోగు అలియాస్ పోతుల శివ, ముప్పురు రాజు, పండుగ రాజును సోమ వారం బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.24 లక్షల నగదు, రెండుబైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నా మన్నారు.

సోమవారం పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ అరెస్టు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన బిపిన్ కుమార్ అనే వ్యాపారి వివిధ జిల్లాలకు సరుకులు ఇచ్చి ప్రతీ నెలా కలెక్షన్‌కు వచ్చేవాడు. పెద్దఎత్తున నగదును తీసుకెళ్లేవాడు. అతని వద్ద హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన పటాలవత్ దాస్ (26) డ్రైవర్‌గా పని చేసే వాడు. డ్రైవర్‌గా పని చేసే సమయంలోనే కారుకు డూప్లికేట్ కీ తయారు చేయించుకున్నాడు. తరువాత పని మానేశాడు. బిపిన్ కుమార్ కలెక్షన్‌కు వెళ్లిన సమయంలో అతని కారు నుంచి నగదు చోరీ చేసేందుకు ప్రణాళిక వేసుకున్నాడు. స్నేహితులైన జోగు అలియాస్ పోతుల శివ(25), ముప్పురు రాజు (25), పండుగ రాజు(22)ను కలుపుకొని చోరీకి పథకం వేసుకున్నారు.

ఈ నెల 16న బిపిన్ కుమార్ హైదరాబాద్ నుంచి కలెక్షన్‌కు మంచిర్యాలకు వెళుతున్నాడని తెలిసి రెండు బైక్‌ల్లో అతడిని అనుసరించారు. మంచిర్యాలలో బిపిన్‌కుమార్ బస చేసిన లాడ్జ్ సమీపంలోని గుళ్లో నిందితులు బస చేశారు. తెల్లవారి నలుగురు రెండు బైక్‌లపై వేరువేరుగా డబ్బులున్న కారును వెంబడించారు. 17న బెల్లంపల్లి బజార్ మెయిన్ రోడ్డులోని సత్తన్న ఇడ్లీ బండి వద్ద నిలిపి ఉన్న కారును నకిలీ కీ ద్వారా డోర్ తెరిచి మాజీ డ్రైవర్ దాసు, అతని స్నేహితుడు శివ రూ.28 లక్షలు ఎత్తుకెళ్లారు. తరువాత బెల్లంపల్లి సమీపంలోని అడవిలో తల దాచుకున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య నాలుగు టీములను ఏర్పాటు చేశారు.

ఈ టీములు సీసీ ఫుటేజీలను పరిశీలించగా బైక్‌లపై వచ్చిన వ్యక్తులు నగదు గల బ్యాగును ఎత్తుకెళ్లినట్టు గురించారు. సోమవారం నిందితులు టిఫిన్ చేయడానికి బెల్లంపల్లికి వస్తుండగా ప్రభుత్వ కళాశాల వద్ద తనిఖీల్లో నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ దేవయ్య, కానిస్టేబుల్ మల్లేషం, మంచిర్యాల సీసీఎస్ కానిస్టేబుళ్ల సతీష్, శ్రీనివాస్‌లకు సీపీ శ్రీనివాస్ రివార్డులు అందజేశారు.

కొండగట్టులో అధ్వానంగా వాహనపూజల షెడ్డు

- వర్షం వస్తే.. పూజలు నిలిచిపోవడమే!
- ఊడిన రేకులు.. వర్షంలోనే భక్తులు
- ముందుకువెళ్లని నూతన షెడ్డు ప్రతిపాదనలు



ఊడిన రేకుల షెడ్డు కింద వర్షంలో భక్తులు

మల్యాల, ఆగస్టు 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో వాహన పూజలు నిర్వహించే షెడ్డు అస్తవ్యస్తంగా మారింది. షెడ్డు రేకులు ఊడి పూజలకు ఇబ్బందిగా మారుతోంది. కొండగట్టు అంజన్న సన్నిధిలో తమ వాహనాలకు పూజలు చేసుకుంటే ఎంతో శుభప్రదమని భక్తులు కొండంత ఆశలతో పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సు, లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్లు, జేసీబీ తదితర వాహనాలకు పూజలు జరుగుతుంటాయి. అయితే ఆలయానికి కొంత దూరంలో గల వాహన పూజల షెడ్డు ఏళ్లుగా మరమ్మతులకు గురి కాగ పట్టించుకోవడం లేదు. రేకులు ఊడి ఉండడం, కోతుల చేష్టలతో అటు భక్తులకు అర్చకులకు అసౌకర్యంగా మారింది. పూజల సమయంలో వర్షం వస్తే వాహనాలు, భక్తులు, అర్చకులు పూర్తిగా తడిచిపోవాల్సిందే. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో వాహన పూజలకు ఆటంకం కలుగుతుండగా వర్షం కురుస్తున్నప్పుడు పూజలు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా ఆయా వాహనాలతో వచ్చిన భక్తులు వర్షంలోనే నిలుచోవల్సిన పరిస్థితి ఏర్పడింది. షెడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు ఎండకు, వానకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. వాహన పూజల ద్వారా దేవస్థానానికి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుండగా కనీసం షెడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని వాహనాలకు అనుగుణంగా పెద్ద నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వై జంక్షన్ ప్రాంతంలో వాహన పూజలు నిర్వహించేందుకు రూ.15లక్షలతో రుపొందించిన ప్రతిపాదనలు ముందుకు వెళ్లడం లేదు. దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శిథిలావస్థలో అబ్బాపూర్ ప్రభుత్వ పాఠశాల



ప్రభుత్వ పాఠశాల

గొల్లపల్లి, ఆగస్టు 19: ప్రభుత్వాలు మారినా తమ ఊరి పాఠశాల దుస్థితి మారడం లేదని గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామస్థులు వాపోతున్నారు. సుమారు యాభై ఏళ్ల కిందట నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. అందులో చదువుకోడానికి విద్యార్థులు, పంపించడానికి తల్లిదండ్రులు, విద్యా బోధన చేయడానికి ఉపాధ్యాయులు జంకుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిచిన విద్య సంవత్సరం వరకు కాలం వెళ్లదీశారు. ఇక ప్రాణాలతో చెలగాటమాడదల్చు కోలేదంటూ ఆర్థిక భారం మీద పడుతున్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పాఠశాల భవనం పూర్తిగా నాచు పట్టి, గోడలు, పైకప్పుల పెచ్చులూడి, కిటికీలు పాక్షికంగా ధ్వంసమై బూత్ బంగళాను తలపిస్తోంది. వర్షం పడినప్పుడల్లా పైనుంచి లోపలికి ధారాళంగా కురుస్తున్న వర్షపు నీటితో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. ఒక్కోసారి ఇక్కడ వర్షం పడినప్పుడల్లా పాఠశాలకు సెలవే. ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం, సంబంధిత ఉన్నతాధికారుల ఉదాసీనతా వెరసి విద్యార్థుల తల్లిదండ్రులకు శాపంగా మారింది. దీంతో కొన్నేళ్లుగా పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికి పట్టించుకున్న నాథులు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మొదటి దఫా పార్టీ సర్పంచ్ ఉన్నప్పటికి నూతన భవనం నిర్మాణానికి నిధుల మంజూరుకు నోచుకోలేదు. గత సంవత్సరం వరకు ఎలా గోలా నెట్టుకొచ్చిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ విద్యా సంవత్సరంలో భయాందోళనతో పాఠశాలకు తమ పిల్లలను పంపించడానికి నిరాకరించి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో సంబంధిత విద్యా శాఖ అధికారులు విద్యార్థుల 0 సంఖ్య నెపంతో పాఠశాలను మూసివేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భయాందోళనతో ప్రైవేట్ బడులకు పంపిస్తున్న తల్లిదండ్రులు

చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా :

ఇటీవల గ్రామంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించిన సందర్భంలో తాజామాజీ సర్పంచ్ పురంశెట్టి పద్మవెంకటేశం తమ గ్రామంలో పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన ప్రభుత్వ విప్ అతి త్వరలో పాఠశాల నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని, ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విప్ హామీతో తమ పాఠశాల పునఃప్రారంభమవుతుందని గ్రామస్థులు కొండంత ఆశతో ఎదిరిచూస్తున్నారు.

భవనం నిర్మించాలి: పురంశెట్టి పద్మ, తాజామాజీ సర్పంచ్,



గ్రామంలో నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్నో కష్టనష్టాలకోర్చి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఊరిలో బడి ఉన్నప్పటికి అది పూర్తిగా కూలిపోయే దశలో ఉంది. దీంతో తల్లిదండ్రులు భయపడి తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు. నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంతో కాలంగా ఉన్నతాధికారులకు, అప్పటి ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోలేదు.

విద్యార్థుల లేక పాఠశాలను మూసివేశాం: జమునా దేవి, ఎంఈవో

గత సంవత్సరం వరకు విద్యార్థులు పాఠశాలలో విద్యనభ్యసించారు. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు ఎవరూ పాఠశాలకు రాకపోవడంతో పాఠశాలను మూసివేయించి ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై ఇతర పాఠశాలలకు పంపించాం. పాఠశాల భవనం ప్రమాదభరి తంగా మారడంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పంపించడానికి జంకు తున్నారు. దీని పై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

పాము కాటుతో యువకుడి మృతి

పాలకుర్తి, ఆగస్టు 19: పాలకుర్తి మండల కేంద్రంలో పాముకాటుతో శాతరాజుల సతీష్(39) ఆదివారం రాత్రి మృతి చెందాడు. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. శాతరాజుల సతీష్(39) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి సతీష్ తన ఇంటి దగ్గర లోని కిరాణాషాప్‌నకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆయనను పాము కాటువేసింది. గమనించిన చుట్టుపక్కల వారు పామును చంపి, యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు సతీష్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19: కరీంనగర్‌లోని ఖాన్‌పురకు చెందిన నిఖిత్ తస్లీం(35) విద్యుదాఘాతంలో మృతి చెందిందని కరీంనగర్ మూడో టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం తన ఇంటిలోని వాషింగ్ మిషన్‌లో బట్టలు వేసి స్విచాన్ చేయగా విద్యుదాఘాతంతో నిఖిత్ తస్లీం కిందపడిపోయిందని తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించగా వైద్యుల పరీక్షించి మరణించినట్లు వెల్లడించారన్నారు. మృతురాలికి భర్త, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న కాంగ్రెస్ నాయకురాళ్లు



మేయర్ సునీల్‌రావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 19: కరీంనగర్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. 33వ డివిజన్ భగత్‌నగర్ మేయర్ క్యాంపు కార్యాలయంలో మహిళా కార్పొరేటర్లు సుధగోని మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, పలువురు మహిళలు మేయర్ యాదగిరి సునీల్‌రావుకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ కరీంనగర్ నగర ప్రజలకు రక్ష బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

●**కరీంనగర్ అర్బన్:** సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు చర్ల పద్మ, ఇతర మహిళా నాయకులు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సుడా కార్యాలయంలో రాఖీ కట్టిన వారిలో మహిళా కాంగ్రెస్ నాయకులు షబానా మహ్మద్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, మహాలక్ష్మి, హసీనా, తిరుమల తదితరులు ఉన్నారు.

●**భగత్‌నగర్:** కరీంనగర్ శివారు రేకుర్తి గ్రామంలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. అకాడమీలో చదివే విద్యార్థులకు అమ్మా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు డాక్టర్ పి.సుజాతారెడ్డి ఆధ్వర్యంలో రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ సతీష్‌రెడ్డి, అడ్మిన్ ప్రవళిక, ఇన్‌చార్జి రాజు, పద్మజ రెడ్డి, దూలం రాధిక, రమ, విద్యార్థులు శ్రీకాంత్, ప్రణయ్, అంజి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

●రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత సోమవారం పర్యవేక్షించారు. రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని హైదరాబాద్ ఫ్లాట్ ఫాంపై డ్యూటీలో ఉన్న డ్రైవర్లకు ఆర్‌ఎం రాఖీలు కట్టారు. రాఖీపౌర్ణమి పురస్కరించుకుని విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, కరీంనగర్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ సురేష్, జీఎల్ నారాయణ, స్టేషన్ మేనేజర్, బస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/శంకరపట్నం/జమ్మికుంట/జమ్మికుంట రూరల్/సైదాపూర్/మానకొండూర్/రామడుగు/చొప్పదండి/తిమ్మాపూర్/చిగురుమామిడి/ఇల్లందకుంట: అన్ని మండలాల్లో రాఖీ పౌర్ణమి వేడకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోదరిమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి అప్యాయతను చాటుకున్నారు. శంకరపట్నం మండలం ఎరడపల్లిలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావుకు ఆర్పీ ఎండీ షాహీనా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటికి మహిళలు రాఖీ కట్టారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అలేటి సుశీల, మండలాధ్యక్షురాలు లావణ్య రాఖీ కట్టారు. హైదరాబాద్‌లో మంత్రి దనసరి సీతక్క మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



డ్రైవర్‌కు రాఖీ కడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం సుచరిత

ఫొటోగ్రాఫర్ కేదార్‌రెడ్డికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న మహిమల కేదార్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19: జిల్లా కేంద్రానికి చెందిన సిగ్మా ఫొటోస్టూడియో యజమాని, సీనియర్ ఫొటోగ్రాఫర్ మహిమల కేదార్‌రెడ్డి రాష్ట్రస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. పోటీల్లో రైతు భరోసా, గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాల విభాగాల్లో మూడు కన్సోలేషన్ అవార్డులను సోమవారం హైదరాబాద్‌లోని గ్రీన్ పార్క్ హోటల్‌లో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, సహచార శాఖ కమీషనర్ హనుమంతరావు, ప్రెస్‌క్లబ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం

కరీంనగర్ రూరల్, ఆగస్టు 19: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో చదువుకున్న జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ప్రతి యేడు సీనియర్, జూనియర్ వాలీబాల్ క్రీడాకారుల సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అందులో బాగంగా వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా 14 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో 18 టీములు పాల్గొనగా సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో బొప్పాపూర్ టీమ్ మొదటి స్థానంలో నిలవగా, గర్రెపల్లి టీం రెండవ బహుమతి సాధించాయి. ప్రతి సంవత్సరం నిర్వహించే పూర్వ విద్యార్థుల క్రీడకారుల సమ్మేళనం వాలీబాల్ క్రీడల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నగునూర్ గ్రామ పెద్దలకు, టీం కోచ్‌లకు, మేనేజర్‌లకు ఆటలు నిర్వహించిన ఉపాధ్యాయులకు నగునూర్ గ్రామం తరుపున పూర్వ సీనియర్ క్రీడాకారులనిర్వహకులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల అందజేత



పుస్తకాలను అందజేస్తున్న బీఎస్‌రావు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19: నగరానికి చెందిన డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు మాట్లాడుతూ నిరుద్యోగ యువత పట్టుదలతో చదివి, ఉన్నత శ్రేణి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఎంచుకున్న లక్ష్యంలో సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్కిల్స్ కొరత కారణంగా దేశంలో సుమార్ 11 కోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సెంటర్ల ఏర్పాటుతో అభివృద్ధితో పాటు ఉపాధి కల్పన దానంతట అదే జరుగుతుందన్నారు.

విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కోసం ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని బీఎస్‌రావు అన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ అలీం మాట్లాడుతూ డాక్టర్ బీఎస్‌రావు తన ఫౌండేషన్ ద్వారా చాల రోజులుగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. గత సంవత్సర కాలంగా నాలుగు జిల్లాల యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వై సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎ.సరిత, నిజామాబాద్, మెదక్ జిల్లా కార్యదర్శులు బుగ్గారెడ్డి, వంశీకృష్ణ, గ్రంధ పాలకురాలు జి.సరిత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీ కార్మికులకు అన్నదానం

కరీంనగర్ రూరల్, ఆగస్టు 19: బొమ్మకల్ గ్రామంలో ఇటుక బట్టీలో పనిచేస్తున్న కార్మికులకు, వలస కూలీలకు లయన్ చింతల కిషన్‌పటేల్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈకార్యక్రమంలో బొమ్మకల్ లయన్స్ ఆఫ్ కరీంనగర్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

మానకొండూర్ ఏఎంసీ పాలకవర్గం నియామకం




మర్రి ఓదెలు, రామిడి తిరుమల్‌రెడ్డి

మానకొండూర్, ఆగస్టు 19 : మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని లలితాపూర్ గ్రామానికి చెందిన మర్రి ఓదెలు, వైస్ చైర్మన్‌గా రంగపేట గ్రామానికి చెందిన రామిడి తిరుమల్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో రెండు రోజుల్లో పూర్తి పాలకవర్గాన్ని నియమించే అవకాశం ఉంది.

● గంగాధర ఏఎంసీ చైర్మన్‌గా జాగిరపు రజితరెడ్డి



జాగిరపు రజితరెడ్డి

గంగాధర: గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కురిక్యాలకు చెందిన జాగిరపు రజిత రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈసారి జనరల్ మహిళకు కేటాయించారు. కురిక్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకుడు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి భార్య రజిత రెడ్డిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఉపాధ్యక్షుడిగా మధురానగర్‌కు చెందిన తోట కరుణాకర్‌తో పాటు 15 మంది డైరెక్టర్లతో కూడిన కమిటీని నియమించారని సమాచారం. ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వ్యవసాయ శాఖకు రావాల్సి ఉంది.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వీణవంక, ఆగస్టు 19: మండల కేంద్రంలో ఈ నెల 24న రైతులకు మద్దతుగా నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని మండల బీజేపీ నాయకులు కోరారు. వారు సోమవారం మండల కేంద్రంలో విలేరులతో మాట్లాడారు. కల్వల ప్రాజెక్ట్‌కు గండిపడి రెండు సంవత్సరాలు గడిచినా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీణవంక, రామకృష్ణపూర్, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల రైతులు కల్వల ప్రాజెక్టు కింద పంటలు పండిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహరాజు, గౌతమ్‌రెడ్డి, బత్తిని నరేష్‌గౌడ్, ఆదిరెడ్డి, మద్దూరి సమ్మిరెడ్డి, ఎనగంటి శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, లింగారెడ్డి, గోవిందరెడ్డి, నవీన్, హరీష్, సదానందం, అజయ్ పాల్గొన్నారు.

'చేపల చెరువులు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

చిగురుమామిడి, ఆగస్టు 19: మండలంలోని చిన్న ముల్కనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద చెరువు శిఖంలో కొందరు అక్రమంగా చేపల చెరువులు నిర్మించారని మాజీ జడ్పీటీసీ సభ్యుడు, జిల్లా ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. చేపల చెరువులు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశామన్నారు.

'స్మార్ట్‌సిటీ టెండర్లలో అవకతవకలు'

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 19: కరీంనగర్‌నగర పాలకసంస్థ స్మార్ట్‌సిటి టెండర్లలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయని 41వ డివిజన్ కార్పోరేటర్ బండారి వేణు ఒక ప్రకటనలో ఆరోపించారు. స్మార్ట్‌సిటి నిధులతో వివిధ కూడళ్ల అభివృద్ధి కోసం పిలిచిన టెండర్లలో అవకతవకలు చేసుకున్నాయన్నారు. అంచనాలకు మించి టెండర్లు పిలవడం, వారికి నచ్చిన వారికి అప్పజెప్పా రన్నారు. నగరంలోని కూడళ్ల అభివృద్ధి పనులపై సమగ్ర విచారణజరిపి జంక్షన్‌లలో మాయమైనమట్టి, టెండర్లలో పేర్కన్న ఐటమ్స్, సైట్‌పైన పెట్టిన ఐటమ్స్ మీద సిఐడి, పోలీసులతో విచారణ చేయించాలన్నారు. పనులపై విచారణతో పాటు, అంచనాలు తయారు చేసిన అధికారులు, వారి వెనుక ఉన్న వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఆగస్టు 19: ఎస్సీ వర్గీకరణకు వెసులుబాటు కల్పిస్తు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దళిత సంఘాలు తలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం వేరు వేరుగా పిలుపునిచ్చారు. వ్యాపారులు, వాణిజ్యరంగాలు, విద్యాసంస్థలు, ఆటో కార్మిక యూనియన్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మార్కండేయ స్వామి ఆలయంలో పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19: నగరంలోని మాండవ్య నదీ తీరం, దేవళ్ళపురిలోలో గల శిభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో శ్రావణ శుద్ధ పూర్ణిమ సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. నూతన యజ్ఞోపవీత ధారణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సంక్షేమట్రస్టు అధ్యక్షుడు చిలుక నరసప్ప, డి తిరుపతి, జె కేదార్, ఆర్ శ్రీనివాస్, వి లక్ష్మణ్, పద్మశాలి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 19 : నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను మేయర్ సునీల్‌రావు ఆదేశించారు. 10 లక్షల రూపాయల నిధులతో నూతనంగా 700 హైమాస్ లైటింగ్ ఏర్పాటుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశామన్నారు. సోమవారం మేయర్ యాదగిరి సునీల్‌రావు 12వ డివిజన్‌లో పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ తోట రాములుతో కలిసి నగరపాలక సంస్థకు చెందిన 25 లక్షల నిధులతో సీసీరోడ్డు, ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ అభివృద్ధికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కాలనీలో ప్రజలు ఎదుర్కుంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజల విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ చేయాలని మేయర్ దృష్టికి తేవడంతో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ డివిజన్లలో 1000 పైగా హైమాస్ట్ లైట్లను, బైపాస్ రోడ్లలో లైటింగ్ వ్యవస్థను మెరుగు పరిచామని తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థను ఉత్తమ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దు తామని స్పష్టం చేశారు. రోడ్డు, డ్రైనేజీ, వాటర్ సప్లై, లైటింగ్, లాంటి అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు ప్రజలకు సమయం ప్రకారం నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. డ్యాం లో నీటి మట్టం పెరగగానే ప్రతి రోజు ప్రజలకు తాగు నీరు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రతి డివిజన్‌లో ప్రజలు ఇబ్బందులు పడకుండా నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నూతన కాలనీల్లో కూడా నిధులను కేటాయించి చాలా వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. నూతన కాలనీల్లో కూడా పెండింగ్‌లో ఉన్న పనులను, సమస్యసను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. 12వ డివిజన్‌లో ఇరుకుగా రోడ్లలో ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైపులైన్ వేసి రోడ్డు విస్తరిస్తున్నట్లు తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర కార్యక్రమాలతో ధ్వంసమైన రోడ్లను కూడా పునర్నిర్మాణం చేస్తున్నామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ ఘటనలపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19: బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై అమానుషంగా కొనసాగుతున్న హత్యాకాండపై ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలని కవి అన్నవరం దేవేందర్ అన్నారు. సోమవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో సంపత్‌యాదవ్ ఆతిత్యంలో జరిగిన 136వ ఎన్నీల ముచ్చట్లలో ఆయన మాట్లాడుతూ సృజనకారులుగా భూగోళంపై జరిగే ప్రతీ అన్యాయాన్ని, అధర్మాన్ని నిలదీసి నిలువరించేందుకు ప్రయత్నించాలని అన్నారు. అనంతరం బంగ్లాదేశ్ కల్లోలం, కలకత్తా జూనియర్ వైద్యురాలిపై అమాయిత్యం, ఒలింపిక్ క్రీడల విజయాలు-పరాజయాలు, అన్నదాతల ఆత్మహత్యలు వంటి అంశాలపై కవులు తమ కవితలను వినిపించారు. అంతకు ముందు బంగ్లాదేశ్‌లో బలి అయిన మృతులకు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ సమన్వయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నడిమెట్ల రామయ్య, విలాసాగరం రవీందర్, నెరువట్ల చైతన్య, ఎండి ఖాలిద్, గుడికందుల అరుణ్, పెద్ది సత్యనారాయణరాజు, ఎం మహేందర్, యుగంధర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సంస్కృత దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19: నగరంలోని వేదభవనంలో తెలంగాణ తెలుగుభాషా సంఘం, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ సంస్కృత దినోత్సవంలో వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె వరప్రసాదాచార్యులు మాట్లాడారు. ప్రపంచ భాషలకు పునాదిగా సంస్కృతం ఉందని అన్నారు. పురాణ, ఇతిహాస, వేద, చారిత్రాత్మక గ్రంధాలు, దేశ చరిత్రకు పుట్టినిల్లు సంస్కృతమేనని అన్నారు. లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కె రామకృష్ణ మాట్లాడుతూ 3500 సంవత్సరాల భాష అయినా ఆగ్లం, గ్రీక్, లాటిన్ వంటి ప్రపంచ వ్యాప్త 876 భాషలకు పునాది సంస్కృతమేనని అన్నారు. ఈ భాష స్పీచ్ థెరపికి ఉపయోగ పడుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేదభవనంలో వేద పండితులను బుర్ర జలజారెడ్డి-డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి దంపతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కృష్ణమాచార్యులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట, ఆగస్టు 19: జమ్మికుంట పట్టణ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో సముద్రాల రమేష్ (30) యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆబాది జమ్మికుంట కు చెందిన రజితను మొగుళ్లపల్లి మండలం పాత ఇసిపేట గ్రామానికి చెందిన సముద్రాల రమేష్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి బాబు, పాప ఉన్నారు. రమేష్ బతుకుతెరువు నిమిత్తం అత్తగారి ఇళ్లు అయిన ఆబాది జమ్మికుంట వచ్చి ఓ ఇళ్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. రమేష్ మద్యానికి బానిసయ్యాడు. వారం రోజులుగా మద్యం సేవిస్తూ భార్యను చిత్ర హింసలకు గురి చేశాడు. దీంతో భార్య గ్రామంలోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. మద్యానికి బానిసైన రమేష్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. రమేష్ భార్య పిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

హుజూరాబాద్ బస్టాండ్‌లో తప్పిన ప్రమాదం

హుజూరాబాద్, ఆగస్టు 19: హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఖీ పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. హుస్నాబాద్, జమ్మికుంట స్టేజీ వద్ద డ్రైవర్ బస్సును రివర్స్ చేస్తుండగా, మరో బస్సు వచ్చింది. దీంతో రెండు బస్సుల మధ్య ప్రయాణికులు చిక్కుకున్నారు. డ్రైవర్ గమనించకుండా బస్సు నడపడంతో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రయాణికుల కేకలు వినిపించడంతో డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో భారీ ప్రమాదం తప్పింది.

పురస్కార గ్రహీతకు సన్మానం

తిమ్మాపూర్, ఆగస్టు 19: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం (సీవోఈ) అలుగునూర్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దూస వీరేశానికి ఇటీవల తెలుగు వెలుగు సాహితీ వేదిక మహానంది జాతీయ పురస్కారం అందజేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వీరేశంను శాలువాతో సన్మానించి అభినందించారు.

'శ్రీ చైతన్య'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం

తిమ్మాపూర్, ఆగస్టు 19: మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యూచర్ డైరెక్షన్ ఇన్ ఏఐ అండ్ డేటా సైన్స్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఐదు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన అధ్యాపకులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్ రాజు, అధ్యాపకుడు కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష అక్షరాల సారాంశం ఒక్క ఫొటోతో ఆవిష్కృతం

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ● ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటోగ్రాఫర్ షుకూర్‌ను సన్మానిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఆగస్టు 19: ఒక్క ఫొటో లక్ష అక్షరాల సారాంశాన్ని ఆవిష్కరిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి ఫొటో జర్నలిస్టులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న పరిణామాలన్నింటిని తన కంటితో ప్రపంచానికి చూపించే ఫొటో జర్నలిస్ట్ నిరంతర శ్రామికుడన్నారు.

● **కరీంనగర్ కల్చరల్:** నగరంలోని పద్మనగర్ మానేరు పాఠశాల ఆవరణలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కడారి అనంతరెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి, జి జనార్దన్‌రెడ్డి, డాక్టర్ ఎస్ మనోహరాచారి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

● **కరీంనగర్ రూరల్:** లయన్స్‌క్లబ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లను సన్మానించారు.కార్యక్రమంలో బొమ్మకల్ క్లబ్ సెక్రెటరీ బట్టు రాజేందర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, జోన్ చైర్మన్ చింతల కిషన్ పటేల్, లయన్ మాసినేని చక్రధర్, బోడ ప్రసాద్, ఆసిరి సుమన్, దాసవేని మల్లయ్య, ఆసిరి సుమన్, మడుప అనిల్, కాల్వ హరీష్, కొత్తకొండ అనిల్ పాల్గొన్నారు.

● **హుజూరాబాద్:** పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సోమవారం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గందె శ్రీనివాస్, మాచర్ల రాజు, యాకుబ్‌అలీ, రాజేష్, రమేష్, చిరంజీవి, శ్రీధర్, రసూల్, అంజాద్, నందు, అశోక్ పాల్గొన్నారు.

● **జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలో మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయం (బొమ్మలగుడి) లో అన్నదానం చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నింటి నాగేంద్ర, గౌరవ అధ్యక్షుడు శివన్న, బికే వెంకన్న, రచ్చ గణేష్, సంగ అశోక్, అజాద్, సందీప్, రవి, దేదేందర్, శ్రీరాములు, ఉపేందర్, హరీష్, సునీల్, రఫీ, రాజనర్సింహ పాల్గొన్నారు.

● **వీణవంక:** మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగెం మోహన్, తాటిపాముల శ్రీనివాస్, కంకల రమేష్, ఉయ్యాల రమేష్, పల్లకొండ సుధాకర్, షఫీ, రాజు, సునీల్, సుమన్, దేవరాజ్, సాయి, కిరణ్, శ్రావణ్, సాయి, ప్రవీణ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

● **చొప్పదండి:** మండల ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొడిగె అజయ్‌కుమార్, నాంపల్లి నరేష్, సామల కిషోర్, పెద్దెల్లి శ్యామ్,సభ్యులు సిరిపురం శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, అనుమాండ్ల మహేష్, సింహాచలం కన్న, నెల్లి శేఖర్, చిర్ర మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా నూలు పౌర్ణమి



భక్త మార్కండేయ ఆలయంలో యజ్ఞోపవీతధారణ చేస్తున్న పద్మశాలి కులస్థులు

చొప్పదండి, ఆగస్టు 19: పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలో నూలు పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి కులస్తులు గాయత్రి మంత్రాన్ని ఉచ్చరిస్తూ సామూహిక యజ్ఞోపవితధారణ వేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇప్పనపల్లి సాంబయ్య, పద్మశాలి కుల సంక్షూమ సంఘం అధ్యక్షుడు దండె రాజయ్య, నాయకులు ఎలిగేటి తిరుపతి, భోగ హరికిషన్, ఎనగందుల మల్లేశం, సిరిపురం మల్లేశం, జక్కని మల్లేశం, అడిగొప్పుల రాజేశం, సిరిపురం ఆంజనేయులు, కళ్యాణపు శ్రీనివాస్ పాల్గొన్నారు

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురికి సన్మానం

హుజూరాబాద్, ఆగస్టు 19: పట్టణంలో పీవీ సేవా సమితి అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి వేల్పుల ప్రభాకర్, కరాటే మాస్టర్ భూసారపు బాపురావులను మెమొంటో, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, మనోజ్, రామలింగారెడ్డి, మాధవరావు, సంపత్‌రెడ్డి, రాజిరెడ్డి, సదానందం, సతీష్, సమ్మయ్య, అంరీష స్వామి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వచ్చి అదుపు తప్పిన కారు

● ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఇనుప దుకాణంలోకి చొచ్చుకెళ్లి బోల్తా



బోల్తాపడిన కారు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 19: జమ్మికుంట మండలం నాగంపేట బస్టాండ్ వద్ద రాచపల్లి రాజయ్య అనే వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని ఆదివారం పార్క్ చేశాడు. ఆ సమయంలో ఇల్లందకుంట మండలం మల్లన్నపల్లికి చెందిన కలాల అఖిల్ అనే వ్యక్తి అతివేగంగా కారు డ్రైవింగ్ చేస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, ఇనుప సామగ్రి దుకాణంలోకి చొచ్చుకెళ్లి రెండు పల్టీలు కొట్టింది. కారు నడుపుతున్న అఖిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుడు రాజయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.